నిలువ నీడ కరువాయే..

- బస్‌షెల్టర్ నిర్మాణానికి నోచుకోని అర్వపల్లి సెంటర్
- వాహనాలు, బస్సుల కోసం రోడ్లపైనే ప్రయాణికుల ఎదురుచూపు



అర్వపల్లిలో ఎర్రటి ఎండలో రోడ్డుపైన బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



రోడ్డుపై నిలిపిన బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

అర్వపల్లి : సూర్యాపేట –జనగామ, నకిరేకల్ –తానంచర్ల రెండు జాతీయ రహదారులకు ప్రధాన కూడలైన అర్వపల్లిలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. రెండు జంక్షన్‌లకు కూడలి కావడంతోపాటు ఇక్కడ ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, మతసామరస్యానికి ప్రతీకైన ఖాజానసీరుద్దీన్ బాబా దర్గా ఉండటంతో ప్రతిరోజు వేలాదిమంది వచ్చి వెళుతుంటారు. కానీ అర్వపల్లిలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ వాహనాల కోసం ఎదురుచూస్తున్నారు.

బస్టాండ్ కోసం కొనసాగిన ఆందోళనలు..

అర్వపల్లిలో బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రజలు ఇక్కడకు వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నారు. బస్టాండ్ నిర్మాణం కోసం ఆందోళన కార్యక్రమాలు కూడా చేపట్టారు. కానీ ఇంతవరకు ఈ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. అర్వపల్లిలో రోడ్డే బస్టాండ్‌గా మారింది. హైవేపైనే బస్సులు, ఇతర వాహనాలు ఆగుతుంటాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు దృష్టి సారించి బస్టాండ్‌ను ఏర్పాటు చేసేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

దరఖాస్తులు ఇస్తూనే ఉన్నాం



అర్వపల్లిలో బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని గత 10 ఏళ్లకు పైనుంచి ప్రజా ప్రతినిధులు, అధికారుల కు దరఖాస్తులు ఇస్తూనే ఉ న్నాం. ఇంతవరకు ఎవరూ స్పందించలేదు. ఇప్పటికైనా బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి.

– దడిపల్లి వెంకట్, సామాజిక కార్యకర్త

ఆందోళనలు కూడా చేపట్టాం



అర్వపల్లిలో బస్టాండ్, వై జంక్షన్‌లో టాయిలెట్ల కోసం బస్టాండ్ సాధన సమి తి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాం. అందరి దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. బస్టాండ్ లేక ప్రయాణికులు రోడ్డుపైనే బస్సులు, వాహనాల కోసం వేచి ఉండాల్సి వస్తుంది.

– మచ్చ నర్సయ్య, పీపీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు

క్లుప్తంగా

మర్రి వెంకటమ్మకు నివాళి

తిరుమలగిరి : వెలిశాల గ్రామానికి చెందిన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి తల్లి మర్రి వెంకటమ్మ ఆదివారం మృతి చెందారు. మృతురాలి పార్థివ దేహాన్ని ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఆరూరి రమేష్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వాసుదేవ రెడ్డి, నాగూర్ల వెంకన్న, ప్రముఖ గాయకుడు, ఏపూరి సోమన్న సందర్శించి నివాళులర్పించారు.

ధ్యానంతో ప్రశాంతత



అర్వపల్లి ధ్యాన కేంద్రంలో ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న రంగారావు

అర్వపల్లి : ధ్యానంతో మానసిక నిశ్చలత, ప్రశాంతత లభిస్తుందని సూర్యాపేట హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సెంటర్ ఇన్‌చార్జ్ ఎం. వెంకటరంగారావు అన్నారు. ఆదివారం అర్వపల్లిలోని ధ్యాన శిక్షణ కేంద్రంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీ రామచంద్రమిషన్‌ల ఆధ్వర్యంలో ఉచిత యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులుసు వెంకటయ్య, పి.రమేష్, ఉష, సైదులు, వనం రమేష్, మేకల సత్యనారాయణ, సతీష్, ఉమ పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న చైర్మన్ సురేందర్‌రెడ్డి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన బాసపోలు చంద్రశేఖర్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.20వేల చెక్కును ఆదివారం జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మండడి పూర్ణచంద్రారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కుక్కడపు సైదులు, రామిడి వెంకట్‌రెడ్డి, బి.ప్రవీణ్, కుదురుపాక ఉదయ్, సైదులు, వీరారెడ్డి, గంగయ్య, మల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



పసునూర్‌లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్

నాగారం : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అన్నారు. పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని పసునూర్ అంగన్‌వాడీ కేంద్రం-1, 2లలో గర్భిణులకు పౌష్టికాహారం, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలను తీసుకుంటే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, మల్లేపాక మంజుల, ఏఎన్‌ఎం లక్ష్మీబాయి, మనీషా, భిక్షమమ్మ, రేణుక, ఆశలు సుజాత, సుశీల, జయమ్మ, గర్భిణులు, బాలింతలు, ఆయా తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

చిలుకూరు: భారతరత్న, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని చిలుకూరులోని రావి నారాయణరెడ్డి కాలనీలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తీరొక్క రంగులతో ఆకర్షణీయంగా ముగ్గులు వేశారు. విజేతలకు సోమవారం బహుమతులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జలియన్ వాలాబాగ్ అమరులకు నివాళి



అమరులకు నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థి మిత్ర మండలి సభ్యులు

సూర్యాపేట అర్బన్ : పంజాబ్ రాష్ట్రంలోని జలియన్ వాలాబాగ్‌లో బ్రిటిష్ ముష్కరులు జరిపిన మారణకాండలో మరణించిన అమరుల సంస్మరణ దినోత్సవాన్ని ఆదివారం సూర్యాపేట పూర్వ విద్యార్థి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేటలో అమరులకు నివాళులర్పించారు. ఇంక్విలాబ్- జిందాబాద్ అని నినాదించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లికార్జున్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య, మిత్ర మండలి కార్యదర్శులు సట్టు వెంకన్న, గుండ్ల కొమురయ్య, వీర్లపాటి వెంకన్న, రామచంద్రయ్య, చంద్రమౌళి, వీరబోయిన భగవాన్, కన్నా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సభ పోస్టర్ ఆవిష్కరణ



తుంగతుర్తిలో చలో వరంగల్ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్

తుంగతుర్తి : ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో చలో వరంగల్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. గులాబీ పార్టీ రజతోత్సవ సభకు లక్షలాదిగా కదలిరావాలని అన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలన ప్రజా సంక్షేమమే పరమావధిగా సాగిందని తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తాడికొండ సీతయ్య, గుండగాని రాములు, యాదగిరి, నాగమల్లు వెంకటేష్, గోపాల్ రెడ్డి, సత్యనారాయణ, దాసు, శ్రీను, మల్లేష్, రమేష్, వెంకన్న, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విక్రమ్ రెడ్డి మరణం తీరని లోటు



వెంపటిలో విక్రమ్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మల్లు నాగార్జున్ రెడ్డి

తుంగతుర్తి : దాయం విక్రమ్ రెడ్డి మరణం తుంగతుర్తి ప్రాంత ప్రజలకు తీరని లోటు అని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. ఆదివారం వెంపటిలో విక్రమ్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తుంగతుర్తి ప్రాంత ప్రజలకు, ముఖ్యంగా వెంపటి గ్రామానికి వెన్నంటి ఉంటూ తన జీవితమంతా ప్రజల కోసమే పనిచేశాడని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కమిటీ సభ్యుడు బుర్ర శ్రీనివాస్, అర్వపల్లి మండల కార్యదర్శి వజ్జే శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు ముత్తయ్య, విష్ణుమూర్తి, గోవిందా చారి, యాదగిరి, చంద్రయ్య, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాలు లేకుండా చూడాలి

కోదాడరూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం రెడ్లకుంటలో కోదాడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిబంధనల ప్రకారం ధాన్యంలో తేమశాతం ఉండే విధంగా ఆరబెట్టాలని, తాలు లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ బుడిగం నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కునుగుంట్ల శ్రీనివాసరావు, సాధినేని అప్పారావు, గంగవరపు లక్ష్మణ్‌రావు, కనగాల నాగేశ్వరరావు, సీఈఓ వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.

దేవాలయ పాలకవర్గానికి సన్మానం



అర్వపల్లి దేవాలయ నూతన పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం



అర్వపల్లి దేవాలయ నూతన పాలకవర్గంతో ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ నూతన పాలకవర్గాన్ని ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వేరువేరుగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, పెసర సతీష్‌రెడ్డి, శ్రీనివాస్, రత్నం సంతోష్, నర్సింగ కృష్ణమూర్తి, శ్రీనివాస్, బింగి కృష్ణమూర్తి, దేవస్థాన ధర్మకర్తలు శ్రీధర్‌రెడ్డి, సోమయ్య, కల్యాణి, యాదగిరి, జె.సోమయ్య, నాయకులు కొమిరెల్లి, రాంప్రసాద్, రాజ్‌కుమార్, నాగరాజు, బొల్లం సైదులు, సురేష్, ఉపేందర్, మహేష్, శ్రీను పాల్గొన్నారు.

దేశంలోనే ఆదర్శంగా సన్నబియ్యం పథకం



తిరుమలగిరి : సహపంక్తి భోజనం చేస్తున్న స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు



నాగారం : మాచిరెడ్డిపల్లిలో సన్నబియ్యంతో భోజనం చేస్తున్న నాయకులు

తిరుమలగిరి : పేదల కోసం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు సంకేపల్లి సుధీర్ రెడ్డి అన్నారు. తొండ గ్రామంలో శనివారం జేరిపోతుల కేశవులు ఇంట్లో గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీతో 80 శాతానికి పైగా బడుగు, బలహీన వర్గాల ప్రజలు ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి, పార్టీ మండల అధ్యక్షుడు నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలకుర్తి రాజయ్య, శాతవాహనరావు, హాఫీజ్, జనార్దన్, నాగయ్య, లక్ష్మయ్య, రామాంజయ్య, కలీం, రామారావు, బత్తుల శీను, రాము గౌడ్, పుల్లయ్య, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నాగారం : ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు అన్నారు. ఆదివారం మాచిరెడ్డిపల్లి గ్రామంలో రేషన్ లబ్ధిదారుడు జినుకాల యాదగిరి ఇంట్లో సన్నబియ్యంతో భోజనం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద ప్రజల ఆకలి తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. గత ప్రభుత్వాలు చేయలేని ఒక చరిత్రాత్మకమైన పనిని కేవలం ఏడాదిన్నర కాలంలో సీఎం రేవంత్‌రెడ్డి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, పసుపులేటి వెంకట్‌రెడ్డి, పానుగంటి నర్సింహారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఎల్మకంటి సోమన్న, యాదగిరి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలి



మాట్లాడుతున్న మట్టిపల్లి సైదులు

నాగారం : భూమిలేని పేద వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భూమిలేని పేదలందరికీ ఏడాదికి రూ.12,000 ఇవ్వాలని కోరారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజు కూలి రూ.600 ఇచ్చి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పులుసు సత్యం, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరకొండ యాదగిరి, సీఐటీయూ మండల కన్వీనర్ గుడుపూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల పండుగ



ఆత్మకూరులో ఈత మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న క్రిస్టియన్లు

ఆత్మకూర్(ఎస్) : మండల వ్యాప్తంగా మట్టల పండుగను క్రిస్టియన్లు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రంగురంగుల కాగితాల పూలతో అలంకరించిన ఈత మట్టలు చేత పట్టి ర్యాలీ తీశారు.

చివ్వెంల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు మట్టల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖర్జూర, ఈత మట్టలతో ఆయా గ్రామాల్లో ర్యాలీ తీశారు. ఈస్టర్ పండుగ ముందు ఆదివారం ఈ పండుగ వస్తుందని, జెరూసలేంలోకి క్రీస్తు విజయవంతమైన ప్రవేశాన్ని గుర్తుకు చేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు సామ్యేల్, దుర్గం ప్రభాకర్, అజయ్, యేసుపాదం, పేతురు, యాకోబు, ఉపేందర్, వెంకన్న, సురేష్, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంల : వేడుకలో పాల్గొన్న క్రైస్తవులు

ప్రమాదకరంగా మూలమలుపులు

- పలు గ్రామాల రహదారుల వెంబడి పెరుగుతున్న కంపచెట్లు
- సూచిక బోర్డులు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



చివ్వెంల నుంచి పాండ్యానాయక్ తండాకు వెళ్లే రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



వట్టిఖమ్మంపహాడ్ నుంచి వాల్యతండాకు వెళ్లే రహదారిలో..

చివ్వెంల : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు మూలమలుపులతో ప్రమాదకరంగా ఉన్నాయి. కనీసం సూచిక బోర్డులు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలో వాల్యతండా, వట్టిఖమ్మంపహాడ్ మధ్య రెండు మూలమలుపులు, మున్యానాయక్‌తండా, బీబీగూడెం గ్రామాల మధ్య రెండు మలుపులు, తిమ్మాపురం, బి.చందుపట్ల గ్రామాల మధ్య మూడు మలుపులు ఉన్నాయి. అలాగే మోదిన్‌పురం, ఖాసీంపేట గ్రామాల మధ్య, లక్ష్మణ్ నాయక్‌తండా, పులితండా మధ్య, బి.చందుపట్ల, భీమ్లాతండా మధ్య, మొగ్గయ్యగూడెం, చందుపట్ల మధ్య, పిల్లలజగ్గుతండా, జయరాం గుడితండా మధ్య, పాశ్యాతండా, పాలిమేర సూర్యాతండా మధ్య రహదారుల్లో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి.

మలుపులకు తోడు ముళ్లకంప..

ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులకు తోడు రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదలతో రోడ్డు కనిపించడం లేదు. గ్రామాల్లో సింగిల్ రోడ్డు ఉండటం వల్ల వాహనాలు వచ్చినప్పుడు అదుపు కాక కిందకు దూసుకువెళ్తూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూలమలుపుల వద్ద పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రోడ్ల వెంబడి కంపచెట్లను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మూలమలుపులు సరిచేయాలి

మండలంలో వివిధ గ్రామాలకు వెళ్లే దారిలో మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటి వల్ల ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుంది. ప్రమాదకరంగా ఉన్న మలుపులను సరిచేయాలి. సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– చెరుకుపల్లి కిరణ్ కుమార్, వట్టిఖమ్మంపహాడ్

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు



నాగారం : ఆర్థికసాయం చేస్తున్న స్నేహితులు



నూతనకల్ : ఆర్థికసాయం చేస్తున్న గ్రామస్తులు

తిరుమలగిరి : తాటిపాముల గ్రామానికి చెందిన 2009-2010 పదవ తరగతి పూర్వ విద్యార్థి సౌమ్యలతకు వారం రోజుల క్రితం హైదరాబాద్‌లో యాక్సిడెంట్ కావడంతో తన కుడి కాలికి ఆపరేషన్ జరిగింది. దీంతో పూర్వ విద్యార్థులు ఆదివారం ఆమెకు రూ.25000 ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో దయా యాదవ్, వల్లపు శోభన్ బాబు, కారుపోతుల చిన్న, బాకి ప్రశాంత్, నాయిని సందీప్, ననుబాల బలరాం, పాక అవిలయ్య, బోయిని ఎల్లేష్, కారుపోతుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల కేంద్రానికి చెందిన పోతుగంటి సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనతోపాటు 2010-13లో సూర్యాపేటలోని స్పందన డిగ్రీ కళాశాలలో చదువుకున్న స్నేహితులు రూ.30వేలు సమీకరించి ఆదివారం సురేష్ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో షేక్ ఆరిఫ్, సందీప్, దేవయ్య, శ్రీనివాస్, శేఖర్, దిలీప్, వీరేష్, ప్రవీణ్, గణేష్, చైతన్య పాల్గొన్నారు.

నూతనకల్ : మండల పరిధిలోని మాచనపల్లి గ్రామానికి చెందిన బోర సీలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామానికి చెందిన పలువురు ఆదివారం మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.25,300 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు

అర్వపల్లి : తిమ్మాపురంలోని సూర్య క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున ఉషా పద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీర హనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదన క్షేత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాకులారపు రజిత, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, బెలిదె లక్ష్మయ్య, జయపాల్‌రెడ్డి, కోటిరెడ్డి, అర్చకులు భీంపాండే, శ్రీరాంపాండే పాల్గొన్నారు.

పల్లెల్లో కనుమరుగవుతున్న ఎడ్లబండ్లు



ఎడ్లబండిపై పెంటమట్టి తరలిస్తున్న రైతు

ఆత్మకూర్(ఎస్) : పల్లె ప్రజలకు, రైతులకు ప్రతి అవసరానికి సేవలందించి రైతు రథాలుగా పేరుపొందిన ఎడ్ల బండ్లు నేడు గ్రామాల్లో కనుమరుగై పోతున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో యాంత్రీకరణ పెరుగుతుండడంతో క్రమేపి ఎడ్ల బండ్ల వినియోగం తగ్గుతూ వస్తోంది. గతంలో ప్రతి రైతు ఇంట్లో ఎడ్ల బండి తప్పనిసరిగా ఉండేది. పూర్వకాలంలో ప్రజలు, రైతులు వేరే ఊర్లకు వెళ్లాలన్నా, పెళ్లిళ్లకు, పండుగలకు, జాతరలకు వెళ్లాలన్నా ఎడ్ల బండిపైనే ప్రయాణించేవారు. తొలకరి వర్షాలు కురియగానే రైతన్నలు నాగలి, పలుగు, పార తదితర వ్యవసాయ పనిముట్లను ఎడ్లబండ్లపై పెట్టుకొని పొలాలకు వెళ్లి వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యేవారు. పంట పండిన అనంతరం ఎడ్లబండ్లలోనే మార్కెట్‌కు గాని, ఇంటికిగానీ ధాన్యాన్ని తరలించేవారు. కానీ ప్రస్తుత యాంత్రీకరణ వ్యవసాయంతో ఎడ్లబండ్లతోపాటు పురాతన వ్యవసాయ పనిముట్లు కూడా కనుమరుగవుతున్నాయి.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఉత్పత్తులు, మార్కెటింగ్ సేవల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆ సంఘం అధ్యక్షుడు నిమ్మల నిరంజన్ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, ఏఎంసీ డైరెక్టర్ జలెందర్, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, నిర్వాహకులు బొల్లం సైదులు, జె.రాంప్రసాద్, కె.సురేష్, ఎం.నాగరాజు, ఎం.మల్లేష్, రైతులు పాల్గొన్నారు.



జాజిరెడ్డిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంఘం అధ్యక్షుడు నిరంజన్